క్లుప్తంగా

వేగంగా అంబేడ్కర్ స్మృతి వనం పనులు



పటమట(విజయవాడతూర్పు):నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం పనులు చురుగ్గా సాగుతున్నాయని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్మృతివనం పనులను గురువారం ఆమె పరిశీలించారు. ప్రాజెక్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. రాత్రిళ్లు చేస్తున్నారని, నిర్దేశించిన సమయానికి పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. గ్రౌండ్స్ చుట్టూ ఉన్న ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లు మరింత అందంగా బ్యూటిఫికేషన్ చేస్తున్నామని చెప్పారు. నవంబర్ 26న స్మృతి వనం ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు వీలుగా డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మిస్తామన్నారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే వాటర్ ఫౌంటేన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలి




మధురానగర్(విజయవాడసెంట్రల్):చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని కనకదుర్గ దేవాలయంలో శివతీర్థ చారిటబుల్ ట్రస్ట్, సెంట్రల్ నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల నాగేశ్వరరావు ఆధ్వర్యాన లోక కళ్యాణార్థం రుద్ర సహిత చండీ హోమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో అంగిరేకుల నాగేశ్వరరావు, గొల్లభామ దంపతులచే రుద్రసహిత హోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు రమణ, సూరిబాబు, దుర్గారావు, వెంకటేశ్వరరావు, భవానీ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న జోగిని శ్యామల

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మను నటి, జోగిని శ్యామల గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జోగిని శ్యామలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందచేయగా, చైర్మన్ రాంబాబు అమ్మవారి ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు.

ఎస్ఎన్ఈఏ నేతల సంబరాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):ఈ నెల 12న దేశ వ్యాప్తంగా జరిగిన బీఎస్ఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్స్ 3వ సభ్యత్వ ధ్రువీకరణ ఎన్నికల్లో సంచారనిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఘన విజయం సాధించింది. సంచారనిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్‌కు, ఆలిండియా గ్రాడ్యుయేట్ ఇంజినీర్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ మధ్య పోటీ జరిగింది. గురువారం జరిగిన ఓట్ల లెక్కింపులో రాష్ట్ర వ్యాప్తంగా 1743 ఓట్లకు గానూ ఎస్ఎన్ఈఏకు 924 ఓట్లు, ఏఐజీఈటీఓఏకు 713 ఓట్లు వచ్చాయి. దీంతో సంచారనిగమ్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఘన విజయం సాధించినట్లు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ఎస్ఎన్ఈఏ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఎస్ఎన్ఈఏ నాయకులు జె.ఉమామహేశ్వరరావు, ఆర్. మహేశ్వరరావు, ఎం.ప్రసాద్‌బాబు మాట్లాడారు.

500 మందికి అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్):పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం 500 మందికి అన్నదానం జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు విశేషంగా పంచామృత అభిషేకం, పూజలు నిర్వహించారు. శ్రీసాయినక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొత్త పింఛన్లతో పేదలకు కొండంత భరోసా



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పింఛన్లు, రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు



పింఛన్ అందజేస్తున్న పెనుమత్స సత్యం

పాయకాపురం(విజయవాడరూరల్): దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పింఛన్‌దారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. కండ్రికలో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి గురువారం ఆయన నూతన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ కొత్త పింఛన్లతో రాష్ట్రంలో లక్షలాది కుటుంబాల్లో వెలుగులు వచ్చాయన్నారు. 64వ డివిజకు సంబంధించి 85 మందికి నూతన పింఛన్లు మంజూరు కాగా, సెంట్రల్ నియోజకవర్గంలో 1458 మందికి మంజూరైనట్లు వెల్లడించారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం పింఛన్ల సంఖ్య 27,576 కు చేరిందన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ల కోసం నిరుపేదలు జన్మభూమి కమిటీల వద్ద పైరవీలు చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త పింఛన్లు అందుకున్న ఆనందం, అవ్వతాతల కళ్లల్లో స్పష్టంగా తెలుస్తుందని పేర్కొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సత్యనారాయణపురం, తాడంకివారివీధిలోని సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్ కార్డుల పంపిణీ గురువారం నిర్వహించారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలసి ఎమ్మెల్యే విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఏఒక్కరికీ పథకాలు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని చెప్పారు. 33వ డివిజన్‌లోనే 60 మందికి మంజూరైనట్లు తెలిపారు. డివిజన్‌లో 113 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు అందించామని వెల్లడించారు. సత్యనారాయణపురంలో 1,108 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని వివరించారు. మొదటి దశలో ఇళ్ల నిర్మాణాలు దాదాపుగా తుది దశలో ఉన్నాయని, మిగిలినవి కూడా త్వరలోనే పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, కమ్మిలి రత్నకుమార్, శనగవరపు శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్):అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన పింఛన్లు గురువారం ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛన్ అంటేనే ఒక ప్రహసనంలా సాగేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులను గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి కొండ, వేదాంతం చైతన్య, కమ్మిలి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. 31వ డివిజన్ వార్డు సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్‌లతో కలిసి అందజేశారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

సబ్ కలెక్టర్ అతిథి సింగ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అతిథి సింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ నగర పాలక సంస్థ, రూరల్ ప్రాంతాల్లోని గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనాలకు సంబంధించి బందోబస్తు తదితర అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సబ్ కలెక్టర్ అతిథి సింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తు పై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, వీఎంసీ, మెడికల్, ఫిషరీస్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి గణేష్ ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేషన్, రూరల్ పరిధిలో మూడు వేల విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతులు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు, మతపరమైన సమస్యలు లేకుండా అనుమతులు ఇవ్వాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన మూడు, ఐదు, తొమ్మిది, 11వ రోజులలో గణేష్ నిమజ్జనాలు జరుగుతాయని ఆఖరి రోజు ఎక్కువ మంది భక్తులు కృష్ణా నది ఘాట్లకు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ లాండ్ ఆర్డర్ కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘాట్లలో సౌకర్యాలు కల్పించాలి...

ఘాట్ల సౌకర్యాల ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యల కోసం ఇరిగేషన్, వీఎంసీ, రెవిన్యూ, విద్యుత్, ఫిషరీస్, ఫైర్ శాఖలు ముందుగా జాయింట్ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రకాశం బ్యారేజి ఎగువ ప్రాంతాల్లోని ఘాట్లలో బారికేడ్లు ఏర్పాట్లలో ఇరిగేషన్ శాఖ, కార్పొరేషన్ సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన క్రేన్‌లను, సిబ్బందిని, వీఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. ఫిషరీస్ శాఖ బోట్ లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ఆయా ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోను, నిమజ్జనాలు నిర్వహించే ఘాట్ల వద్ద కంట్రోల్ రూమ్‌లను రెవెన్యూ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. లైఫ్ జాకెట్‌లతో సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు.

గాడిచర్ల హరి సర్వోత్తమరావుకు నివాళి

మధురానగర్(విజయవాడసెంట్రల్):స్వతంత్ర సంగ్రామంలో సర్వోత్తముడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు అని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం గాడిచర్ల జయంతి నిర్వహించారు. హరి సర్వోత్తమరావు చేసిన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పీవీ సుబ్బరాజు, సహాయ కార్యదర్శి వి.సింగంరాజు, కోశాధికారి టి. శ్రీనివాసరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వరరాజు, కార్యదర్శి కె.ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, కోశాధికారి డీజేపీ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాచార్యుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బుచ్చయ్యాచార్యులు, రామానుజాచార్యులు, సీవీకే శాస్త్రి తదితరులు

విజయవాడ కల్చరల్: కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు శ్రీమాన్ ఎస్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శతజయంతి సందర్భంగా 16 నుంచి ఐదురోజులపాటు శతజయంతి, సంగీత, సమ్మానోత్సవాలు నిర్వహిస్తునట్లు కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ బుచ్చయాచార్యులు తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణమాచార్యులు బహుభాషా కోవిదుడని తెలిపారు. సుదీర్ఘకాలం విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేశారని పేర్కొన్నారు. వారి సేవలు నేటి తరానికి స్ఫూర్తి కలిగించడానికి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోజూ 12 గంటలపాటు సంగీత ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కృష్ణామాచార్య కళాపీఠం ఉపాధ్యక్షుడు టీకేవీ రామానుజా చార్యులు మాట్లాడుతూ ఆచార్యులవారి శిష్యప్రశిష్యులు సంగీత కచేరీలు నిర్వహిస్తారన్నారు. 20 వ తేదీ పద్మశ్రీ పురస్కార గ్రహీత యల్లా వెంకటేశ్వరరావుకు పురస్కారం ప్రదానం చేస్తునట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ కోశాధికారి ఎస్‌సీహెచ్ శ్రీరామచక్రవర్తి, సంగీత విద్వాంసులు పోవూరి గౌరీనాథ్, సీవీకే శాస్త్రి, కౌశిక్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

ప్యాకేజీ స్టార్‌కు డీల్ కుదిరింది

ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాజకీయాల్లో ఉనికి కోల్పోయిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోమారు టీడీపీ ప్యాకేజీలకు అమ్ముడుపోయాడని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్ రెడ్డి విమర్శించారు. విజయవాడలో గురువారం గౌతమ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ములాఖత్ పేరుతో పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో బేరం కుదుర్చుకున్నట్లు తేటతెల్లమైందన్నారు. పవన్ కళ్యాణ్ మీద నమ్మకం పెట్టుకున్న అభిమానులు, కాస్తో కూస్తో నమ్మిన వాళ్లకు భ్రమలు తొలగిపోయాయని పేర్కొన్నారు. జనసేన, టీడీపీలను మూకుమ్మడిగా రాష్ట్రం నుంచి తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీతో జనసేన ఒక అక్రమ కలయిక అని ధ్వజమెత్తారు. ఒంటరిగా పోటీచేయలేమని చెప్పకనే చెప్పారన్నారు. రాష్ట్రంలో కోట్లాది మందికి ఏదో ఒక రూపేణా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. అందుకే ఆయన తిరుగులేని ప్రజాదరణ కలిగిన నేతగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో 5.50 కోట్ల మంది ఉంటే దాదాపు 5 కోట్ల మందికి ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాలు దరిచేరాయన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడిందంతా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాసిచ్చిన స్క్రిప్టేనన్నారు. అందులో ఎక్కడా కూడా తన సొంత నిర్ణయం ఏదీ ఉన్నట్లుగా కనిపించడం లేదన్నారు.

రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన



అభివృద్ధి పనుల గురించి అధికారులకు వివరిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నగర శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తెలిపారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని మస్జీద్ పరిసర ప్రాంతాలలో సుందరీకరణ పనులు, భరతమాత గుడి ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సర్కిల్–2 డీఈ గురునాథంతో కలిసి 58, 59 డివిజన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. నగర శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది మధుసూదన్, నాయకులు రమేష్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆయుర్వేద సంస్థలో హిందీ దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 29వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆస్పత్రిలోని సిబ్బందికి క్విజ్, వ్యాస రచన, కవితలు, పాటలు పోటీలు హిందీలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

హిందీతో ఉపాధి అవకాశాలు అధికం

మధురానగర్(విజయవాడసెంట్రల్):హిందీ భాష నేర్చుకోవటం వల్ల దేశంలో ఎక్కడికి వెవెళ్లినా ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ సహాయక అధ్యాపకులు డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు నిత్య జీవితంలో హిందీ ఆవశ్యకతను వివరించారు. ఉద్యోగాల్లో హిందీ ఆవశ్యకత ఎంతో పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హిందీ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలపాటి భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్):వైఎస్సార్ సీపీ 31వ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం గురువారం నగరంలోని పలు ప్రాంతాలలో రోడ్లపై యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతు సామాజిక బాధ్యతగా నిరుపేదలు, యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. అన్నిదానాలలో అన్నదానం మిన్న అని ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో అన్నదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందు, అంగిరేకుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో జగనన్న సురక్ష సర్వే

పటమట(విజయవాడతూర్పు): త్వరలో ప్రారంభమయ్యే జగనన్న సురక్ష హెల్త్ క్యాంపునకు పూర్తిస్థాయిలో సర్వే జరగాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి డివిజన్లలో ఉన్న ప్రతి ఇంటినీ సర్వే చేసి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా ప్రణాళికను రూపొందించామని చెప్పారు. మొదటి దశలో వలంటీర్లు, వార్డు సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తారని చెప్పారు. ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరగబోయే రోజు, తేదీతోపాటు ఏయే కార్యక్రమాలు చేపడతామో ప్రజలకు వివరిస్తామన్నారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ పథకంలో ఎంప్యానెల్ అయిన ఆసుపత్రులు ఎక్కడ ఉన్నాయి ? ఎలా వెళ్లాలి ? ఉచితంగా వైద్యం అందుకోవాలంటే ఆరోగ్యశ్రీని ఎలా వినియోగించుకోవాలన్న అంశాలపై ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

రెండో దశలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఏరియా వలంటీర్లు డివిజన్లలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు 7 రకాల టెస్టుల గురించి తెలియజేస్తారని తెలిపారు. ఫేజ్ –3లో హెల్త్ క్యాంపునకు 3 రోజుల ముందు వలంటీర్, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ఆ వార్డులో మరోసారి పర్యటిస్తారన్నారు. ఫేజ్ 4లో ప్రతి డివిజన్‌కు హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ పూర్తిగా బాధ్యత తీసుకుని ఆ వార్డుని మ్యాపింగ్ చేస్తారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి వార్డు వలంటీర్లు, సెక్రటరీలకు, ఆరోగ్య సిబ్బందికి ప్రజాలందరు సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలులో అగ్రస్థానం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు బ్రోచర్ అందచేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ 282వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. కండ్రికలో విస్తృతంగా పర్యటించి 300 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నాలుగేళ్ల లో డివిజన్లో రూ.12.33 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కండ్రిక గ్రామం నుంచి ఎన్ఎస్‌బోస్ నగర్ వరకు రూ.3.30 కోట్ల డీఎంఎఫ్‌టీ ఫండ్‌తో రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రూ.2.70 కోట్లతో ఉడా కాలనీ నుంచి కండ్రిక వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లను పిలవనున్నట్లు వెల్లడించారు. రూ.కోటి నిధులతో కండ్రిక డీపీ స్టేషన్ నుంచి ఉడా కాలనీ జంక్షన్ వరకు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చుతున్నట్లు తెలిపారు. రూ.19.98 లక్షల వ్యయంతో విశాలమైన కర్మల భవనాన్ని నిర్మించామని పేర్కొన్నారు. 4 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విడుదలైన రూ.80 లక్షల నిధులతో అనేక రోడ్లకు మోక్షం లభించిందన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, శ్రీరాములు, జిల్లెల శివ, పందిరి వాసు, మాతా మహేష్, వెంకటేశ్వరమ్మ, విమల, కోటి, కిరణ్, కృప తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్లో కార్యక్రమ నిర్వహణపై పార్టీ శ్రేణులతో ఆయన సమీక్షించారు. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైన వారికి ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం, పెద్దాస్పత్రులకు సిఫార్సు చేయడం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలకు వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి ఏఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారని చెప్పారు. ఆ సమాచారం ఆధారంగా ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికి వచ్చి బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30 వరకు ఆయా ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు సేవలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, కార్పొరేటర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఉచిత యోగా, ప్రాణాయామం శిక్షణ తరగతులు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పైపుల కంపెనీ సెంటర్‌లోని భగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం శ్రీభగవత్ శక్తి అసోసియేషన్ యోగా, ధాన్య కేంద్రం ఆధ్వర్యాన ఉచిత యోగా, ప్రాణాయామం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మందిర గౌరవ అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు పెరిగిపోతున్న ఒత్తిడి అనారోగ్య సమస్యలను అధిగమించటానికి ఈ ఉచిత శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని చెప్పారు. నిపుణులైన శిక్షకులచే తరగతులు నిర్వహించటం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉదయం 5.50 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధురానగర్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు, యోగ, ప్రాణాయామం సాధన చేయాలనుకునేవారు పాల్గొనవచ్చని కోరారు. ఆసక్తికలిగిన వారు 9154028198, 7382623057 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
మన భారతదేశానికి ఎన్నో ప్రాజెక్టులను అందించిన మేటి ఇంజనీరు శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి ఆశయ సాధనకోసం పనిచేస్తున్న ఇంజనీర్స్‌కు, కాబోయే ఇంజనీర్స్‌కు ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
సూపరింటెండెంట్ ఇంజనీర్
RWS ఇంజనీర్స్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా

స్థాపితం: 1929
ది దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్: No.H.953, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ - 520001. ఫోన్: 2568716
బ్రాంచి ఆఫీస్: 23-22-82, శివాలయం వీధి, సత్యనారాయణపురం, విజయవాడ-11. ఫోన్: 2533462
బ్రాంచి ఆఫీస్: 1-3-84, నాలుగు స్తంభాల సెంటర్, విద్యాధరపురం, విజయవాడ-12. ఫోన్: 2416592

మహాజన సభ నోటీసు

[illegible]

విజయవాడ
తే.14-09-2023
JDC, MA, LLB

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com